క్లుప్తంగా

ఎ.కోడూరులో 137 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు: ప్రతి నెలా గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో ప్రజల చెంతకే వైద్యం అందుతుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ తెలిపారు. గురువారం ఎ.కోడూరులో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 137 మంది రోగులను ఆయన పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. వైద్య సిబ్బంది సంతోషికుమారి గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి. త్రినాథ్ పాల్గొన్నారు.

మల్లంపాలెంలో ముగ్గుల పోటీలు



విజేత మహిళలకు బహుమతులను అందిస్తున్న నిర్వాహకులు

కె.కోటపాడు: మల్లంపాలెంలో ముగ్గుల పోటీల్లో విజేత మహిళలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కనుమ పండగ పురస్కరించుకుని బుధవారం రాత్రి ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మహిళలు సంక్రాంతి విశిష్టత ఉట్టిపడేలా రంగులతో ముగ్గులు వేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బొడ్డు లక్ష్మీ దేముడుబాబు, జాగరపు కన్నంనాయుడు, వార్డు సభ్యులు వంటాకు గోవిందరావు, వంటాకు రామునాయుడు, కర్రి అప్పారావు, వంటాకు చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఎంతో ఆనందంగా సాగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో 2005–06 ఏడాదిలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం రాచపల్లి జంక్షన్ సమీపంలో కామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్నారు. ఈ సందర్భంగా 20 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకోవడంతోపాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో 150 మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మోదమ్మకు వెండి బహూకరణ



ఆలయ చైర్మన్ సంజీవరావుకు పావు కిలో వెండి అందజేస్తున్న భక్తులు పైడిశ్రీ, సుష్మశ్రీ

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో వెలసిన మోదకొండమ్మకు గ్రామానికి చెందిన గొల్లవిల్లి వరహామూర్తి, నాగమణి దంపతుల కుమార్తెలు పైడి శ్రీలక్ష్మి, సుష్మశ్రీ లక్ష్మి సంయుక్తంగా పావు కిలో వెండిని బహూకరించారు. ఆలయ చైర్మన్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు గురువారం ఉదయం అందజేసి తమ భక్తిభావం చాటుకున్నారు. కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, జాజిమొగ్గల చిరంజీవి, జల్లి హరిప్రసాద్, శానాపతి సముద్రం, జొన్నపల్లి నాగరాజు, కలిమి శివ, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

అధునాతన భవనాలు..
మెరుగైన వైద్యం

- చౌడువాడ, లంకవానిపాలెం పీహెచ్‌సీలకు పునరుజ్జీవం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.3.87 కోట్లతో నిర్మాణాలు
- రోగులకు తీరిన కష్టాలు



లంకవానిపాలెం పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి(ఫైల్)



రూ.1.67 కోట్లతో నిర్మించిన లంకవానిపాలెం పీహెచ్‌సీ భవన సముదాయం



శిథిలాస్థితికి చేరుకున్న చౌడువాడ పీహెచ్‌సీ పాత భవనం



చౌడువాడ పీహెచ్‌సీ నూతన భవనం

కె.కోటపాడు: గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.3.87 కోట్లతో అధునాతన హంగులతో నిర్మించిన పీహెచ్‌సీల భవనాల్లో ఇప్పుడు రోగులకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. దశాబ్దాలుగా శిథిలావస్థ భవనాల్లో అరకొర వసతులతో వైద్య సిబ్బంది తీవ్ర ఇక్కట్లు పడుతుండేవారు. దాంతో రోగులు వచ్చేవారు కాదు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో నాడు – నేడు నిధులతో వీటికి పునరుజ్జీవం కల్పించారు. లంకవానిపాలెంలో 1968లో, చౌడువాడలో 1985లో నిర్మించిన పీహెచ్‌సీ భవనాలు శిథిలమై పెచ్చులూడిపోయేవి. ఈ భవనాల్లో పూర్తిస్థాయిలో వైద్యం అందించాలంటే వైద్య సిబ్బంది ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నాడు–నేడు నిధులతో ఆస్పత్రులకు భవన సముదాయాల నిర్మాణాలతో పాటు మౌలిక వసతులను కల్పించారు. అప్పటి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో లంకవానిపాలెం పీహెచ్‌సీకి రూ.కోటి 67 లక్షలు, చౌడువాడ పీహెచ్‌సీకి రూ.కోటి 70 లక్షలు మంజూరు చేశారు. వీటితో పాటు చౌడువాడ పీహెచ్‌సీలో రోగులు వేచి ఉండేందుకు ప్రత్యేకంగా రూ.50 లక్షలతో అదనపు గది నిర్మించారు. గత ప్రభుత్వ కాలంలోనే వీటిని ప్రారంభించారు.



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు

చౌడువాడ, లంకవానిపాలెం పీహెచ్‌సీల పరిధిలోని 32 గ్రామాల్లో గర్భిణులకు నూతన భవనాల్లోనే ప్రస్తుతం ప్రసవాలు చేస్తున్నారు. ఒక్కో పీహెచ్‌సీలో నెలకు కనీసం పది వరకూ ప్రసవాలు చేస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలుపుతున్నారు. గతంలో భవనాలు బలహీనంగా ఉండడంతో ఇక్కడ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేసి ప్రసవాలకు మాత్రం కె.కోటపాడు, అనకాపల్లి సీహెచ్‌సీలకు విశాఖ కేజీహెచ్‌లకు రిఫర్ చేసేవారు. ప్రస్తుతం రెండు పీహెచ్‌సీ భవనాలు అందుబాటులోకి రావడంతో ఇక్కడే ప్రసవాలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ల్యాబ్‌ల ఏర్పాటుతో పలు రకాల పరీక్షలు చేస్తున్నారు. రెండు పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు వైద్యం సేవలందుతున్నాయి.

మౌలిక వసతులతో భవనాలు



గత వైఎస్సార్‌సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన పీహెచ్‌సీలను కొట్లాది రూపాయలతో నిర్మించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో చౌడువాడ పీహెచ్‌సీకి రూ.2.20 కోట్లతో అత్యాధునిక హంగులతో నిర్మించారు. ఆస్పత్రిలో మౌలిక వసతులను కల్పించారు. మాజీ సీఎం, డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు

– రొంగలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ

రోగుల కష్టాలు తీరాయి



గతంలో లంకవానిపాలెం పీహెచ్‌సీ భవన నిర్మాణాలు పూర్తిగా బలహీనంగా ఉండేవి. ఇక్కడ వైద్య సేవలందించేందుకు సిబ్బంది ఉన్నా.. భవన పరిస్థితి దృష్ట్యా రోగులు వచ్చేందుకు జంకేవారు. ఇప్పుడు ఆస్పత్రికి పూర్తిస్థాయిలో భవనాలు, మౌలిక వసతులు కల్పించడంతో రోగులకు నమ్మకం కలిగింది.

– నెక్కల పెంటయ్య, గవరపాలెం, కె.కోటపాడు మండలం

పూడిక తొలగించుకున్న కాలనీవాసులు



బీసీ కాలనీలో పూడిక తొలగించుకుంటున్న స్థానికులు

మాకవరపాలెం: డ్రైనేజీల్లో పూడికను స్థానికులే తొలగించాల్సిన దుస్థితి నెలకొంది. స్థానిక బీసీ కాలనీలో ఇవి పూడికపోయినా చాలాకాలంగా శుభ్రం చేయడం లేదు. దాంతో దుర్గంధం వెలువడుతోంది. దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరికి చేసేది లేక గురువారం స్థానికులు పూడిక తొలగించుకున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

మాడుగుల: చీడికాడ, మాడుగుల మండలాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు జరగనున్నాయని ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. దూడలు, పెయ్యిలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తామన్నారు. ఎదకు రాని, గర్భకోశ వ్యాధులున్న పశువులకు ఉచిత వైద్యంతోపాటు మందులు అందజేస్తామన్నారు. రోజుకు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పశువైద్యాధికారి, పశు సహాయకులు, రైతు సేవా కేంద్రంలోని పశు సేవ సిబ్బందితో రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు.

వైభవంగా దండుముత్యాలమ్మ తీర్థం



భక్తులతో రద్దీగా మారిన దండుముత్యాలమ్మ ఆలయ ప్రాంగణం

కె.కోటపాడు: గొండుపాలెం గ్రామ దేవత దండుముత్యాలమ్మ తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి తీర్థం సందర్భంగా గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. అమ్మవారికి పసుపుకుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలైన గుర్రపు యజమానులకు నగదు పురస్కారాన్ని నిర్వాహకులు అందించారు.

బోయిలకింతాడలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి: బోయిలకింతాడలో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు పర్యవేక్షణలో గురువారం ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలను, డ్రైనేజీల్లో పూడికలను పారిశుధ్య కార్మికులతో తొలగింపచేశారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్ది, అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ధ్యేయమని సర్పంచ్ స్పష్టం చేశారు.

సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం : డీఎం ధీరజ్



ఆర్టీసీ డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న డిపో మేనేజర్ ధీరజ్

నర్సీపట్నం: సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ డ్రైవర్లు కీలక భూమిక పాత్ర పోషించాలని డీఎం ఎం.ఎస్.ఎస్. ధీరజ్ పేర్కొన్నారు. స్థానిక గ్యారేజ్‌లో డ్రైవర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ భూభాగంలో ఒకరు తన ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి రక్షణ కల్పించే సైనికుడు కాగా, రెండో వ్యక్తి ప్రయాణికుల భద్రతకు భరోసా ఇచ్చే డ్రైవర్ అన్నారు. ఆర్టీసీలో ప్రయాణిస్తే భద్రత ఉంటుందని ప్రయాణికుల నమ్మకం అన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు ప్రమాదాలకు తావులేకుండా సేవలు అందించాలన్నారు. ఆర్టీసీలో జీరో యాక్సిడెంట్ నమోదుకు డ్రైవర్లు కృషి చేయాలన్నారు. టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్ ఏకాగ్రత కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. అసిస్టెంట్ మేనేజర్ పి.ఆచారి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి

ముద్దుర్తిలో హోరాహోరీగా ఎడ్లబళ్ల పోటీలు



అంబేరుపురంలో మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకోవడానికి తరలివచ్చిన గ్రామస్తులు



ముద్దుర్తి గ్రామంలో జరిగిన ఎడ్లబళ్ల పోటీల్లో దౌడుతీస్తున్న ఎడ్లబండి

చోడవరం: సంక్రాంతి తీర్థాలతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో సంక్రాంతి పండగ నుంచి గ్రామ దేవతల ఉత్సవాలు, తీర్థాలు జోరుగా సాగుతున్నాయి. చోడవరం మండలంలో ముద్దుర్తిలో శ్రీరాముల వారి తీర్థం జరిగింది. ఈ సందర్భంగా ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించారు. పోటీల్లో చోడవరం పరిసర మండలాల నుంచి 15 ఎడ్లబళ్ల పోటీ పడ్డాయి. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అంబేరుపురం గ్రామంలో మరిడిమాంబ తీర్థం జరిగింది. అమ్మవారిని దర్శించుకుని తీర్థంలో అంతా సరదాగా గడిపారు.

ఘనంగా రైవాడ ఎరకాలమ్మ తీర్థం

దేవరాపల్లి: రైవాడ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం ఎరకాలమ్మ తీర్థం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారిని రైవాడ, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ చల్లా లక్ష్మి, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, కె.ఎస్. అప్పలనాయుడు, చల్లా నాయుడు, ఉగ్రూకుల అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో ముత్యమాంబ తీర్థం నేడు

ఎ. కొత్తపల్లిలో ముత్యమాంబ తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి తెలిపారు. మధ్యాహ్నం నుంచి మహిళల కోలాట ప్రదర్శన, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నిత్యం తాగునీరు వృథా..

- పైపులైన్లు, వాల్వుల లీకేజీలు
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం



తహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలోని వాల్వుల నుంచి వృథాగా పోతున్న తాగునీరు



పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న వాటర్ సప్లయి సిబ్బంది


నర్సీపట్నం: పైపులైన్ల నిర్వహణ సరిగా లేకపోవడం, లీకేజీలను పట్టించుకోకపోవడంతో విలువైన తాగునీరు వృథాగా పోతోంది. స్థానిక మున్సిపాలిటీలోని నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం ప్రాంతాలకు దుగ్గాడ ప్రాజెక్టు నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సరఫరా చేస్తున్న నీటిలో 30 శాతం మేర వృథాగా రోడ్డు పాలవుతున్నట్టు అంచనా. దీంతో దిగువకు సక్రమంగా నీరందక ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నర్సీపట్నం మున్సిపాలిటీలోని దుగ్గాడ, ఉత్తర వాహినిలో బోరుబావుల నుంచి బలిఘట్టంలో ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో నీటిని శుభ్రం చేసి తరలించి పట్టణ వాసుల దాహార్తి తీర్చుతున్నారు. పట్టణంలో 70 వేల మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో సగటు మనిషికి రోజూ 80 ఎంఎల్‌టీ చొప్పున సరఫరా చేయాల్సి ఉంది. ఈ విధంగా రోజుకు 6.0 ఎంఎల్‌టీ (మిలియన్ లీటర్లు) నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 3.25 ఎంఎల్‌టీ నీటిని సరఫరా చేస్తున్నారు. రోజుకు ఒక్కో వ్యక్తికి 40 లీటర్లను అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. పట్టణానికి వెళ్లే ప్రధాన పైపులైను, వార్డులకు సరఫరా చేసే పైపులైన్లు, వాల్వుల నిర్వహణ సరిగా లేక ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడి పెద్ద ఎత్తున నీగునీరు వృథాగా పోతోంది. కొందరు సిబ్బంది నిర్లక్ష్యం దీనికి తోడవుతోంది. తాత్కాలిక మరమ్మతులతో కొద్ది రోజులకు యథాస్థితే నెలకొంటోంది. పూర్తిస్థాయిలో నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు.

నెలలుగా రోడ్డుపాలు...

తహసీల్దార్ కార్యాలయం సముదాయంలోని వాల్వుల నుంచి.. కొన్ని నెలలుగా పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని సరఫరా చేస్తుంటారు. విలువైన తాగునీరు మురుగు కాలువ పాలవుతోంది. దీంతో తహసీల్దార్‌కు కార్యాలయానికి వెళ్లే దారి చిత్తడిగా మారుతోంది. రోజూ ఏదో ఒక చోట లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా అవుతోంది. ఇలా వృథాతో సరిపడా నీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వృథాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పండగెళ్లిపోయినా జీతభత్యాల్లేవు...



ఆందోళన చేస్తున్న ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం నాయకులు, కార్మికులు

చోడవరం : జీత భత్యాలు పాత బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటికీ పరిష్కరించలేదంటూ ఫ్యాక్టరీ ఆవరణంలో గురువారం కార్మికులంతా విధులను నిలిపివేసి గేటు బయట ఆందోళన చేశారు. సంక్రాంతిలోగా కార్మికులకు రావలసిన పాత బకాయిలు చెల్లిస్తామని చెప్పి ఇప్పటి వరకూ ఎందుకు చెల్లించలేదని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి. భాస్కరరావు ప్రశ్నించారు. కార్మికులకు ఇవ్వాల్సిన ఓటీల డబ్బులు ఇవ్వలేదని, గతేడాది నుంచి డీఓలు ఇవ్వలేదని, ఇవన్నీ వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. సంక్రాంతి పండగ అయిపోయినా నేటికీ జీతభత్యాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు

చోడవరం: క్రీడలు మానసిక ఉల్లాసం, శరీర దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు అన్నారు. గోవాడలో మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ -25 పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో గోవాడకు చెందిన గేమ్ ఛేంజర్ జట్టు మొదటి బహుమతి గెలుచుకుంది. విక్టరీ హంటర్స్ జట్టు రెండో బహుమతి కైవసం చేసుకుంది. విజేతలకు ఏడువాక సత్యారావు, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ బహుమతులు అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బెరా సత్యారావు పాల్గొన్నారు.



విజేతలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు

రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట: బుచ్చింపేట గ్రామం నుంచి శ్మశాన వాటికకు మండల అభివృద్ధి నిధుల నుంచి ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఇక్కడ శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు సరిగా లేక దహన సంస్కారాలు చేసేందుకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ ఉలబాల సత్యవతి ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన రూ.5 లక్షలు మంజూరు చేశారు. అంతేకాకుండా కొబ్బరికాయ కొట్టి సర్పంచ్, ఎంపీటీసీలతో కలిసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉలబాల రాము, దాలబ్బాయి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. నిధులు మంజూరు చేసినందుకు గాను ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com